15 లోపు పశు గణన పూర్తి చేయాలి

ద్వారకాతిరుమలలో కేంద్ర బృందం పర్యటన

ద్వారకాతిరుమల: కేంద్ర ప్రభుత్వ సలహాదారులు, స్టాటిస్టిక్స్ జగత్ హజారికా వారి సిబ్బం దితో ద్వారకాతిరుమల మండలంలో పర్యటించారు. స్వామి వారి దర్శనం అనంతరం ప్రస్తుతం జరుగుతున్న 21వ అఖిల భారత పశు గణన కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. స్వామి వారికి గోశాలలో పశు గణనకు సంబం ధించి తనిఖీ చేశారు. అనంతరం సూర్యచంద్రరావు పేట గ్రామంలో క్షేత్ర స్థాయిలో పర్యటించి పాడి రైతులు, మేకలు, గొర్రెల పెంపకందారుల వద్ద నుంచి వివరాలు సేకరించారు. పశు గణన చేస్తున్న ఎన్యూమేరే టర్లను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పశు గణన కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ టి.గోవిందరాజులు, సంచాలకుల వారి కార్యాలయం నుంచి డాక్టర్ శ్రీనివాసరాజు, చందు ,భీమడోలు ఎడి డాక్టర్ సాయి రమేష్, డాక్టర్ హర్ష మండల పశు వైద్యాధికారి డాక్టర్ అంగర సురేష్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రంప్ దెబ్బకు..

ఆక్వా ఢమాల్

లబోదిబోమంటున్న రొయ్య రైతులు

కిలో రొయ్య ధర రూ.40 నుంచి రూ.70 వరకూ తగ్గుదల

ఎకరాకు రూ.2 లక్షల వరకూ నష్టం

ప్రజాశక్తి - భీమవరం

ఒడిదుడుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఆక్వా సాగు ట్రంప్ టారిఫ్‌ల యుద్ధతో అతలాకుతలమవుతోంది. అగ్రరాజ్యం అమెరికా విధించిన సుంకం డాలర్ పంటను కుదేలు చేసింది. దీంతో ఆక్వా రంగానికి పెట్టింది పేరుగా ఉన్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఆక్వా రైతులు లబోదిబోమంటున్నారు. ఒక్కసారిగా రొయ్యల ధరలు కిలో రూ.40 నుంచి రూ.70కి తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో ఆక్వా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

కొన్నాళ్ల నుంచి ఆక్వా సాగు పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. నాణ్యమైన సీడ్ దొరకకపోవడం, ఫీడ్ ధరలు పెరిగిపోవడం, విద్యుత్ ఛార్జీలు పెరిగిపోవడం, వైరస్ ప్రభావం, సాగు వ్యయం రెట్టింపు వంటి వాటితోపాటు రొయ్య ధరను ఎగుమతిదారులు సిండికేట్ అయ్యి తగ్గించడం వంటి సమస్యలతో ఆక్వా రైతులు సతమతమవుతున్నారు. అయినప్పటికీ సాగు సాగిస్తున్న రైతులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం పిడుగుపాటులా మారింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2.90 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు ఉంది. దీనిలో రొయ్యల సాగు సుమారు 1.10 లక్షల ఎకరాలు, చేపల సాగు 1.80 లక్షల ఎకరాల్లో ఉంది. ప్రతియేటా నాలుగు లక్షల టన్నుల రొయ్యలు ఉత్పత్తి అవుతున్నాయి. దీనిలో సుమారు 3.5 లక్షల టన్నుల వరకు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. భారత్ నుంచి విదేశాలకు ఎగుమతి అవుతున్న మాంసాహార ఉత్పత్తుల్లో రొయ్యలది మూడో స్థానం. ఆక్వా ఉత్పత్తుల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాదే సింహభాగం. మొత్తంగా రూ.18 వేల కోట్ల వ్యాపారంలో విదేశీ లావాదేవీల వాటే అధికంగా ఉంది. భారత సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులపై అమెరికా ప్రభుత్వం విధించిన 26 శాతం ప్రతీకార సుంకం ఈ నెల తొమ్మిది నుంచి అమల్లోకి రానుంది. ఈ నేపథ్యంలో సుంకాల ప్రకటన వెలువడిన కొన్ని గంటల్లోనే రొయ్యల ధరల పతనం ప్రారంభమైంది. కిలో రొయ్య ధర రూ.40 నుంచి రూ.70 వరకూ పడిపోయింది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని ఆక్వా రంగ పరిశీలకులు చెబుతున్నారు. ఇప్పటికే ఉన్న 5.76 కౌంటర్ వెల్లింగ్ డ్యూటీ (సివిడి)తోపాటు యాంటీ డంపింగ్ డ్యూటీలను కూడా కలుపుకుంటే ఈ సుంకాల భారం 33 శాతం నుంచి 35 శాతం వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

రెండు రోజుల్లో రూ.40 నుంచి రూ.70 వరకు ధర పతనం

ఆక్వా ఉత్పత్తులపై అమెరికా సుంకం పెంపుతో జిల్లాలో ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడింది. రొయ్యలు ఆయా కౌంట్లను బట్టి ధర పతనమైంది. 100 కౌంట్ రొయ్య ధర రెండు రోజుల క్రితం రూ.240 ఉండగా తాజాగా రూ.200 నుంచి రూ.190 వరకూ తగ్గిపోయింది. 90 కౌంటు ధర రూ.250 ఉండగా ప్రస్తుతం రూ.210, 80 కౌంట్ రూ.260 ఉండగా రూ.220కు, 70 కౌంట్ ధర రూ.280 నుంచి రూ.240కు, 60 కౌంట్ రూ.290 నుంచి రూ.260కు, 50 కౌంటు రూ.350 నుంచి రూ.300కు, 30 కౌంటు ధర రూ.470 నుంచి రూ.400కు తగ్గిపోయింది. సాధారణంగా 40, 30, 20 కౌంట్లు ఉండే రొయ్యలను మాత్రమే అమెరికాకు ఎగుమతి చేస్తారు. అయితే ప్రతీకార సుంకాన్ని సాకుగా చూపించి ఎగుమతిదారులు అన్ని కౌంట్లపై కిలోకు రూ.30 నుంచి రూ.70 వరకు తగ్గించారు. కొన్నిచోట్ల కొనుగోళ్లు లేవని, ట్రేడర్లు ముందుకు రావట్లేదని రైతులు వాపోతున్నారు. దీంతో సాగుదారులే కాకుండా ఆక్వా రంగంపై ఆధారపడ్డ కూలీల ఉపాధి కూడా దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని పరిశీలకులు చెబుతున్నారు.

ఎకరాకు రూ.2 లక్షల చొప్పున నష్టం

ముడి సరుకు ధరలు తగ్గినప్పటికీ ఫీడ్, సీడ్ ధరలు అధికంగా ఉండడంతో సాగు వ్యయం విపరీతంగా పెరిగి గత ఆరు నెలల నుంచి ఆక్వా రైతులు కష్టనష్టాల మధ్య కొట్టుమిట్టా డుతున్నారు. ఈ క్రమంలో ట్రంప్ నిర్ణయం ఆక్వా రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. రొయ్యల సాగులో వంద కౌంట్ రావడానికి రూ.230 నుంచి రూ.240 వరకు ఖర్చవుతుంది. ఇది కూడా చెరువులో వేసిన పిల్ల కనీసం 80 శాతం పెరిగితే ఈ ధరకు పెట్టుబడులు వస్తాయి. అయితే వంద కౌంట్ ధర ప్రస్తుతం రూ.200కు పడిపోయింది. ఈ నేపథ్యంలో ఎకరాకు రూ.2 లక్షల చొప్పున నష్టం వాటిల్లే దుస్థితి ఏర్పడనుంది. అయితే ఇది ఇక్కడితో ఆగుతుందా, లేక కొనసాగుతుందా అనే ఆందోళన రైతులను వెంటాడుతోంది.

అమెరికా సుంకంతో ఆక్వా రైతులకు తీవ్ర నష్టం

కె.రాంబాబు, ఎపి సీఫుడ్స్ సప్లయర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి

ఆక్వా ఎగుమతులపై అమెరికా 26 శాతం సుంకం విధించింది. దీనివల్ల ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నూటికి 26 శాతం అంటే రైతు కుదేలైపోతాడు. సహజంగా 100 కౌంట్ ధర రూ.240 ఉంటే దీనిలో 26 శాతం అంటే రూ.165 మాత్రమే చేతికి వస్తుంది. ఇది రైతుకి తీవ్రమైన నష్టం కలిగిస్తుంది. ఒకో ఎకరానికి భారీగానే నష్టాలు ఏర్పడుతున్నాయి. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఆక్వారంగ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరతాం.

ఆక్వా అనుబంధ రంగాలపై తీవ్ర ప్రభావం

బి.శ్రీరామ్మూర్తి, ఎపి సీఫుడ్ సప్లయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు



రైతు దేశానికి వెన్నెముక. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. ఆక్వా రంగంతోపాటు అనుబంధ రంగాలపై ఆధారపడి ఎంతోమంది జీవనం సాగిస్తున్నారు. రైతులు, కమీషన్ ఏజెంట్లు, కాంట్రాక్టర్లు, కూలి పనులు చేసుకునే వారు ఇలా చెప్పుకుంటూ పోతే అనేకమంది ఉన్నారు. అమెరికా సుంకం విధింపు భారం ఒక్క ఆక్వా రంగంపైనే కాకుండా మిగిలిన అనుబంధ రంగాలపైనా తీవ్ర ప్రభావం పడింది. ఇప్పటికే అనేక ఇబ్బందుల మధ్య ఆక్వా సాగవుతోంది.

ఆక్వా రంగం నిర్వీర్యమయ్యే ప్రమాదం

కలిదిండి సందీప్ వర్మ, ఆక్వా రైతు

ఆక్వా ఎగుమతులపై ట్రంప్ విధించిన 26 శాతం సుంకం రైతులకు తీరని నష్టదాయకం. దీనిపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సరైన నిర్ణయం తీసుకోవాలి. సుంకం విధింపు ప్రకటన రోజు నుంచే ధరలు తగ్గడం ప్రారంభమయ్యాయి. రూ.40 వరకు ధరలు తగ్గాయి. ఇంకా ధరలు తగ్గే అవకాశం కూడా ఉంది. రానున్న రోజుల్లో ఆక్వా రంగం కుదేలై నిర్వీర్యమయ్యే ప్రమాదం కూడా ఉంది.

జగ్జీవన్‌రామ్ పోరాటాలు మరువలేనివి

కలెక్టర్ వెట్రిసెల్వి, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అణగారిన ప్రజల అభ్యున్నతికి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన పోరాటాలు మరువలేనివని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ 117వ జయంతి సందర్భంగా ఏలూరు ఓవర్ బ్రిడ్జి సమీపంలోని ఆయన కాంస్య విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ తొలి ఉప ప్రధానిగా జగజ్జీవన్‌రామ్ ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. దేశ భవిష్యత్ కోసం ఆయన అందించిన స్ఫూర్తిదాయక సేవలు ప్రస్తుత తరానికి ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, వివిధ దళిత సంఘాల నేతలు జుంజు మోజెస్, పెద్దాడ వెంకటరమణ, మేతర అజయ్ బాబు, డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ

ఏలూరు: బాబూ జగ్జీవన్‌రామ్ గొప్ప సంఘ సంస్కర్త అని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. జగ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకలు స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో శనివారం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి ధాత్రిరెడ్డి, ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య, మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిధి జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ పేదల సంక్షేమానికి కృషి చేయడంతోపాటు విలువలతో కూడిన రాజకీయ జీవితం గడిపారన్నారు. అంతటి మహనీయుని జీవితాన్ని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి), నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం నుండి నేటి యువత ఎన్నో నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రకాశ్, మైనార్టీల సంక్షేమ శాఖాధికారి ఎన్ఎస్.కృపావరం, ఉద్యాన శాఖ డిడి రామ్మోహన్, ఏలూరు తహశీల్దార్ శేషగిరిరావు, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, షెడ్యూల్డ్ కులాల సంఘాల నాయకులు పొలిమేర హరికృష్ణ, మెండెం సంతోష్‌కుమార్, దాసరి ఆంజనేయులు, మేతర అజేయబాబు, కలపాల రవి, నేతల రమేష్ బాబు, ధనియాల శంకర్, తోకల రాజేష్, దేవరకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జెసి, మేయర్

118 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

రబీలో రెండు లక్షల ధాన్యం కొనుగోలు లక్ష్యం

జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో 2024-25 రబీ ధాన్యం సేకరణ ఈ నెల రెండో తేదీ నుంచి ప్రారంభమైందని, 118 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం మొత్తం ధాన్యం 3.53 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని, రెండు లక్షల టన్నులు ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నామని ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ధాన్యం సేకరణ లక్ష్యం 1.50 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించామని, రైతుల శ్రేయస్సు దృష్ట్యా జిల్లా అధికారుల అభ్యర్థన మేరకు రెండు లక్షల మెట్రిక్ టన్నులుగా పెంచినట్లు తెలిపారు. నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని పేర్కొన్నారు. గోనె సంచులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. 22 మండలాల్లో సాగు చేసిన ధాన్యం సేకరణకు 118 ఆర్ఎస్‌కెల్లో ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అవసరమైన సిబ్బందిని రైతు సేవా కేంద్రాల్లోని ధాన్యం కొనుగోలు ఏజెన్సీల ద్వారా నియమించామని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఎటువంటి సందేహాలున్నా ఫిర్యాదు చేసేందుకు జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ నెంబర్లు 08812-230448, 7702003584, 7569562076, 7569597910నకు కాల్ చేయవచ్చునని సూచించారు.

చింతలపూడిలో గాలి, వాన బీభత్సం

నేలనంటిన భారీ వృక్షాలు

ఇంటిపై చెట్టు పడి ముగ్గురికి గాయాలు

క్షతగాత్రులకు ఎంఎల్ఎ రోషన్‌కుమార్ పరామర్శ

మామిడి, మొక్కజొన్న పంటలకు నష్టం

బోయగూడెంలో కరెంట్ తీగలపై పడిన చెట్టు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో శనివారం సాయంత్రం అకాల వర్షం, ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలి దుమ్ముతో మొక్కజొన్న, మామిడికి తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. చింతలపూడి రత్న హాల్, సాయి స్ఫూర్తి హాస్పిటల్ వద్ద భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సాధారణ సీడ్ మొక్కజొన్న విరిచి పొలాల్లో ఆరబెట్టిన రైతులు పంట తడిచిందని లబోదిబోమంటున్నారు. చేతికొచ్చిన మామిడి కాయలు గాలి దుమ్ముకు రాలిపోయాయి. ఏదేమైనా అకాల వర్షం, గాలి దుమ్ము రైతులకు నష్టం మిగిల్చిందనే చెప్పొచ్చు.

సుప్రీంపేటలో ఇంటిపై పడిన చెట్టు

సుప్రీంపేట గ్రామంలో తీగల యశోద ఇంటిపై చెట్టు పడటంతో ముగ్గురికి గాయాలయ్యాయి. సుడిగాలి బీభత్సాన్ని గుర్తించిన చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అధికారులను అప్రమత్తం చేసి రాకపోకలకు అంతరాయంగా ఉన్న పడిపోయిన చెట్లను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. సుడిగాలి సృష్టించిన బీభత్సంలో పలుచోట్ల గాయపడి చింతలపూడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. వైద్యులు క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. చింతలపూడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జనరేటర్ కాలిపోవటంతో ఆయన వెంటనే మరమ్మతులు చేయించి రోగులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నారు. చింతలపూడి మున్సిపల్ కమిషనర్ పావని, ఎస్ఐ కుటుంబరావు, రెవిన్యూ అధికారులు రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు.

గాలికి రాలిపోయిన మామిడికాయలు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడేటప్పుడు చెట్లు, టవర్స్, విద్యుత్ స్తంభాలు, పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని తెలిపారు. సురక్షితమైన భవనాల్లో, ఇళ్లల్లో ఉండాలని పేర్కొన్నారు. విద్యుత్ వైర్లు తెగిపడే ప్రమాదం ఉందని, జాగ్రత్తలు తీసుకోవాలని ఏమైనా ఇబ్బంది తలెత్తితే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

జాతీయ స్థాయిలో శనివారపుపేట విద్యార్థుల ప్రతిభ

చిత్రకళా పోటీల్లో బంగారు, వెండి పతకాలు

ప్రజాశక్తి - ఏలూరు

విజయవాడ డ్రీమ్ వర్క్స్ ఆర్ట్ గ్యాలరీ వారు 12వ జాతీయ స్థాయి బాలబాలికల చిత్రకళా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో శనివారపుపేట జెడ్‌పిహెచ్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆర్.సాయికీర్తన, సిహెచ్.వైష్ణవి, ఎనిమిదో తరగతి చదువుతున్న తేజస్వీ, సిహెచ్.యతికీరత్న, తొమ్మిదో తరగతి చదువుతున్న ఎ.నాగరాజు, బంగారు పతకాలు, ఆరో తరగతి చదువుతున్న సిహెచ్.జోష్న, ఆర్.రూత్‌రాయ్‌గ్రేస్ వెండి పతకాలు సాధించారు. వారికి డ్రీమ్ వర్క్స్ ఆర్ట్ గ్యాలరీ సంస్థ ఫౌండర్ పి.రమేష్ శనివారం అందించారు. విజేతలను, ఆర్ట్ టీచర్ ఎమ్‌డి.ఇర్షాద్‌అహ్మద్‌లను శనివారపుపేట జెడ్‌పిహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రకాష్‌రావు, పాఠశాల సిబ్బంది, ఎస్ఎంసి కమిటీ సభ్యులు అభినందించారు.



పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

నమ్మకం.. నయవంచన..!

మరో యువతి లైంగిక వేధింపులు, నయవంచన భరించలేక బలవన్మరణానికి పాల్పడింది. తన తల్లిదండ్రులకు తాను అల్లారుముద్దుగా పెంచుకున్న ఏకైక ముద్దుబిడ్డ అని తెలిసినా బలవన్మరణానికి పాల్పడిందంటే నయవంచకుని వేధింపులు ఏస్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఏలూరులో ఒంటరి మహిళను డబ్బు కోసం బంధువే చంపడంతోపాటు మృతదేహంపై పెట్రోల్ పోసి కాల్చేసే ప్రయత్నం చేయడం అకృత్యాలకు అడ్డుకట్ట పడేదెప్పుడు అనే చర్చ సర్వత్రా సాగుతోంది.

జీలుగుమిల్లి మండలం రౌతుగూడేనికి చెందిన నాగాంజలి మృత్యువుతో పోరాడి ఓడిపోయింది. రాజమండ్రిలో ఓ ఫార్మసీ విద్యాసంస్థలో ఫార్మసీ చదువుతున్న నాగాంజలి ఇంటర్న్‌షిప్ నిమిత్తం అదే నగరంలోని కిమ్స్ ఆసుపత్రిలో పని చేస్తోంది. అదే ఆసుపత్రికి చెందిన ఎజిఎం దీపక్ ప్రేమ పేరుతో నమ్మించి వంచించాడు. లైంగిక దాడులతోపాటు వేధింపులు తట్టుకోలేక నాగాంజలి మోతాదుకు మించి మత్తు ఇంజెక్షన్లు తీసుకుని బలవన్మరణానికి పాల్పడింది. 12 రోజులపాటు అదే ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడిన ఆమె అలసి కన్నుమూసింది. దీనిపై ఐద్వా, ఇతర ప్రజాసంఘాల ఆందోళనతో కదిలిన పోలీసులు దీపక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. అయితే అదే జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నాగాంజలి మృతి తర్వాత కుటుంబానికి న్యాయం చేస్తామని ప్రకటించడం తప్ప ముందస్తుగా ఏవిధంగానూ స్పందించకపోవడం చర్చనీయాంశమైంది. నాగాంజలి భౌతికకాయాన్ని కడసారి చూసేందుకు రాజమండ్రిలో ప్రజాసంఘాల నేతలను అనుమతించకపోవడం గమనార్హం. ఇప్పటి వరకూ అసలు ఆస్పత్రిలో ఏం జరిగిందనే దానికి సంబంధించి సీసీ టీవీ ఫుటేజీలను పోలీసులు బయట పెట్టకపోవడంపై అంతా మండిపడుతున్నారు. దీపక్ అకృత్యాలకు నాగాంజలినే బలైందా, లేక ఇంకా ఎవరైనా బాధితులున్నారా అనేది తేల్చాలని, దీపక్‌ను కఠినంగా శిక్షించడంతోపాటు నాగాంజలి కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజాసంఘాలు కోరుతున్నాయి. అయితే గతంలో నిర్భయ్, తర్వాత

దిశ, ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో చట్టాలున్నా మహిళలపై అఘాయిత్యాలకు ఎందుకు అడ్డుకట్ట పడటం లేదనే చర్చ మరోసారి నాగాంజలి మృతితో ప్రారంభమైంది. ఇటీవల కాలంలో జిల్లాలో మహిళలపై అఘాయిత్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇటీవలే ఏలూరు నగరంలో ఒంటరి మహిళను సమీప బంధువు డబ్బు కోసం హత్య చేసి, ఆపై పెట్రోలు పోసి కాల్చేసే ప్రయత్నం చేయడం అందరికీ తెలిసిందే. గతంలో పట్టపగలే ప్రయివేటు స్కూల్ టీచర్‌ను ప్రేమోన్మాది కత్తితో నరికి హత్య చేశాడు. పని కోసం నగరానికి వచ్చిన మహిళపై మందుబాబులు అత్యాచారానికి పాల్పడ్డారు. మొత్తంగా చూస్తే ఇంట్లోనూ, పని ప్రదేశాల్లోనూ, బహిరంగ ప్రదేశాల్లోనూ ఎక్కడా మహిళలకు రక్షణ లేదనేది ఈ ఘటనలు చెప్పకనే చెబుతున్నాయి. కేవలం ఘటన జరిగినప్పుడు అధికారులు హడావుడి చేసి సరిపెట్టకుండా ఘటనల వెనుక కారణాలు, వాటి నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఆ దిశగా పాలకులు ఎప్పటికి చర్యలు తీసుకుంటారో.. అకృత్యాలు, అఘాయిత్యాలు ఎప్పటికి ఆగుతాయో వేచిచూడాల్సిందే.

ఇక ఆప్కాస్‌ను రద్దు చేయొద్దంటూ రెండు జిల్లాల్లోని మున్సిపల్ కార్మికులు ఆందోళన చేస్తున్నారు. దీనిపై ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలోనూ చర్చ సాగింది. గత ప్రభుత్వ విధానాలు మార్చడమే పనిగా కాకుండా అందులో ప్రధానంగా కార్మికులకు గతంతో పోలిస్తే ఎంతోకొంత ఉపయోగంగా ఉన్న ఆప్కాస్‌ను రద్దు చేయొద్దనేది కార్మికుల ప్రధాన డిమాండ్. ఆప్కాస్‌ను రద్దు చేస్తే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల భవిష్యత్తు మళ్లీ ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతుంది. దీనివల్ల ఆయా ఉద్యోగ కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయి. అలాకాకుండా కార్మికులకు ఉపయోగంగా ఉన్న ఆప్కాస్‌ను కొనసాగిస్తూనే మరింత మెరుగ్గా దాన్ని తీర్చిదిద్దాలని కార్మికులు కోరుతున్నారు. అలాకాకుండా ప్రభుత్వం గుడ్డిగా ఆప్కాస్‌ను రద్దు చేస్తే కార్మికులకు నమ్మక ద్రోహం చేసినట్లేనని కార్మిక నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

జెస్సీరాజ్ నేటి యువతకు ఆదర్శం

సిఎం చంద్రబాబు ప్రశంస

ప్రజాశక్తి - దెందులూరు

ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్ అవార్డు గ్రహీత, ప్రపంచ స్కేటర్ మాత్రపు జెస్సీరాజ్ క్రీడా నైపుణ్యం అభినందనీయమని సిఎం చంద్రబాబునాయుడు అన్నారు. తైవాన్‌లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ తైవాన్ ఆర్టిస్టిక్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో రెండు గోల్డ్, ఒక సిల్వర్, ఒక బ్రౌంజ్ మెడల్‌ను జెస్సీరాజ్ సొంతం చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర సచివాలయంలో సిఎం చంద్రబాబును ఆమె తన తల్లిదండ్రులు రాధా, సురేష్, సోదరుడు జోయల్‌తో కలిసి మర్యాదపూర్వకంగా కలిసింది. 14 ఏళ్ల చిరు ప్రాయంలోనే ప్రపంచ క్రీడా వేదికపై సత్తా చాటుతున్న జెస్సీరాజ్ ప్రతిభను సిఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆమె కృషి, పట్టుదలను ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర క్రీడా ఖ్యాతిని ప్రపంచానికి చాటాలని యువతకు ఈ సందర్భంగా సూచించారు. రాష్ట్రంలో క్రీడలను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దీని కోసం అమరావతిలో స్పోర్ట్స్ సిటీని నిర్మిస్తున్నామని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ పోటీలను రాష్ట్ర రాజధానిలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది జులై 17 నుంచి 29వ తేదీ వరకు దక్షిణ కొరియాలో జరిగే ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లోనూ పతకాలు సాధించి రాష్ట్ర, దేశ ఖ్యాతిని చాటాలని జెస్సీరాజ్‌కు సూచించారు. ఆమెకు శిక్షణ ఇస్తున్న కోచ్ సింహాద్రిని సిఎం ప్రత్యేకంగా అభినందించారు.

జెస్సీరాజ్‌ను అభినందిస్తున్న సిఎం చంద్రబాబు

7 నుంచి రైల్వేగేటు మూసివేత

ప్రజాశక్తి - మండవల్లి

రైల్వే ట్రాక్ మరమ్మతుల నిమిత్తం మూడు తాళ్లపాడు రైల్వే గేటును మూసివేస్తున్నామని సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఎమ్‌డి అబ్దుల్ రెహమాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లెవెల్ క్రాసింగ్ 74 వద్ద అత్యవసర రైల్వే ట్రాక్ మరమ్మతులకు నోచుకుందన్నారు. ఆ ప్రాంతంలో మరమ్మతులు చేయడానికి ఈ నెల ఏడో తేదీ నుంచి 13వ తేదీ సాయంత్రం ఏడు గంటల వరకు మూడు తాళ్లపాడు రైల్వేగేటును మూసివేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ అసౌకర్యాన్ని గమనించి అటు దిశగా ప్రయాణించే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగించి రైల్వే సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

11న సిఎం పర్యటనా ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఈ నెల 11న ముఖ్యమంత్రి చంద్రబాబు నూజివీడు నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో ఆగిరిపల్లిలో నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ కె.వెట్రిసెల్వి శనివారం పరిశీలించారు. హెలిప్యాడ్, బహిరంగ సభకు సంబంధించిన ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెలిప్యాడ్, బహిరంగ సభకు ప్రదేశంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. హెలిప్యాడ్, బహిరంగ సభ ప్రదేశానికి దూరం తక్కువగా ఉండేలా చూడాలన్నారు. బహిరంగ సభకు హాజరయ్యే ప్రజలను దృష్టిలో పెట్టుకుని సభాప్రాంగణం ఎంపిక చేయాలన్నారు. వేసవి దృష్ట్యా బహిరంగసభకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్, తహశీల్దార్ పి.ఎస్.ప్రసాద్, ఎంపిడిఒ బి.ఆనంద్‌బాబు, ఆగిరిపల్లి, వడ్లమాను సర్పంచులు సిహెచ్.లక్ష్మి, జె.లక్ష్మీకుమారి, నాయకులు నెరుసు సతీష్, బెల్లిని శివరామకృష్ణ, నక్కనబోయిన వేణు, ఆరేపల్లి శ్రీనివాసరావు, పామర్తి నరసింహారావు, దొండపాటి ఏసుపాదం, మాదేల సత్యకుమార్, ముల్లంగి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత

ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు

ప్రజాశక్తి - భీమడోలు

ప్రాధాన్యత క్రమంలో గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి సకాలంలో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం ద్వారా కార్యక్రమాలను చేపట్టడంలో పోలసానిపల్లి గ్రామ సర్పంచి చూపుతున్న చొరవ అభినందనీయమని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆయన శనివారం సాయంత్రం భీమడోలు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా సూరప్పగూడెం, పొలసానిపల్లి, ఇతర గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులకు ప్రారంభోత్సవం చేశారు. పోలసానిపల్లిలో పంచాయతీ నిధులతో చేపట్టిన కొన్ని పనులకు ప్రారంభోత్సవాలు, మరి కొన్నింటికి శంకుస్థాపనలు చేశారు. మొత్తంగా మండలంలో రూ.1.20 కోట్ల ఉపాధి హామీ నిధులతో చేపట్టి పూర్తిచేసిన సీసీ రోడ్లకు ప్రారంభోత్సవాలు చేశారు. పోలసానిపల్లిలో గ్రామం నుంచి ఉపయోగార్థం ఆర్‌అండ్‌బి రోడ్డు నుంచి పొలాలను అనుసంధానం చేస్తూ మూడు కిలోమీటర్ల పొడవున ఏర్పాటుచేసిన గ్రావెల్ రోడ్డు ప్రారంభించి, దాని నాణ్యత, ఇతర అంశాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీకి చెందిన రూ.ఐదు లక్షల నిధులతో హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియల అనంతరం కార్యక్రమాలు చేపట్టేందుకు నీటి కొరత ఉన్నందున, స్థానికుల విజ్ఞప్తి మేరకు ఆ ప్రాంతంలో బోరు ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచి ఎంఎల్ఎ దృష్టికి తీసుకొచ్చారు. పొలసానిపల్లి గ్రామంలో తెలుగు స్వాతంత్ర్య సమరయోధుడు జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకొని గ్రామ సర్పంచి సహాయ సహకారంతో ఏర్పాటుచేసిన జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ప్రారంభించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ఎంపిడిఒ పద్మావతి దేవితో పాటు పలువురు మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రకృతి సందర్శనతో పులకించిన విద్యార్థులు

ప్రజాశక్తి - దెందులూరు

ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ విద్యాశాఖ ఆధ్వర్యంలో జీలకర్రగూడెంలో ఉన్న గుంటుపల్లి బౌద్ధ ఆరామంలో ప్రకృతి శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకుల ప్రత్యేక ఆదేశాల అనుసరించి ప్రకృతి వాయు మన్య పరిధిలోని ఎనిమిది ఉన్నత పాఠశాలలకు చెందిన 60 మంది ఎకోక్లబ్ విద్యార్థులు, ఎనిమిది మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉదయం విద్యార్థులు నేచర్ వాక్ చేశారు. విద్యార్థులు వివిధ రకాల విత్తనాలను, పువ్వులను, ఆకులను సేకరించారు. ఈ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త స్వర్ణవెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వనరులను పాడుచేయకుండా వాడుకుంటూ వాటిని తర్వాత తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, లేదంటే భవిష్యత్తు తరాల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని చెప్పారు. చెట్లను నాటాలని, వ్యర్థాలను తొలగించాలని, పునరుత్పాదక ఇంధనాలను ఉపయోగించాలని, పర్యావరణానికి హాని కలిగించే కార్యకలాపాలను నివారించాలని తెలిపారు. ప్రకృతి పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందినవారికి బహుమతులు అందించారు.

కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వేలేరుపాడు

మండలంలోని కమ్మరిగూడెంలో రెండు వారాల క్రితం దాబా పైనుంచి కింద పడి మతిస్థిమితం కోల్పోయిన మిడియం చిన్నబాబుకు ఇంకా ఆపరేషన్ జరగలేదు. కుటుంబ సభ్యుల వద్ద నగదు లేకపోవడంతో ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఆపరేషన్ చేయించాలనుకున్నా కార్డులో ఈ పేరు నమోదు కాలేదు. విషయం తెలుసుకున్న పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు బాబుకు అవసరమైన ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేయాలని సూచించారు. దీంతో ఆసుపత్రి సిబ్బంది ఆపరేషన్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆపరేషన్ తర్వాత కూడా చాలాకాలం మంచానికి పరిమితం అవుతాడు. కుటుంబం ఆర్థిక పరిస్థితి బాగోకపోవడంతో మండలంలోని జనసైనికులు జనసేన మండల ప్రధాన కార్యదర్శి మేదినేని సంజయ్ ఆధ్వర్యంలో రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు. సహాయం చేయాలనుకున్న దాతలు మిడియం నవీన్ 9676635247 నెంబరుకు ఫోన్ పే చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన సంయుక్త కార్యదర్శులు శివరామ్, కిరణ్ వంశీ, వీరాస్వామి, భాను, సాయి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో గోపాలపురం ఎఎంసి ఛైర్మన్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల చినవెంకన్నను గోపాలపురం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు కుటుంబ సమేతంగా శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఆలయ ముఖమండపంలో అర్చకులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందించారు. ఆయన ఇఒ ఎన్‌విఎస్‌ఎన్.మూర్తి, ఆలయ ఇఇ భాస్కర్ ఆయనకు స్వామివారి మెమెంటోను అందించారు.

నేరాలు - ఘోరాలు

వడాలిలో చోరీ

ముదినేపల్లి : మండలంలోని వడాలి గ్రామంలో బంగారు వస్తువులు చోరీ జరిగినట్టు పోలీసులు శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బత్తుల నాగమణి భర్త వెంకట్ క్రితం చనిపోగా ఆమె ఒంటరిగా జీవిస్తుంది. గత నెల 16న అనారోగ్యంగా ఉండటంతో ఇంటికి తాళాలు వేసి గుడివాడ ఆసుపత్రికి వెళ్లి చూపించుకుని అక్కడే రాజేంద్రనగర్‌లో నివాసం ఉంటున్న తన తల్లిదండ్రుల ఇంటి వద్ద ఉంది. తిరిగి శనివారం ఉదయం వచ్చేసరికి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న సుమారు 11 కాసుల బంగారపు వస్తువులు దొంగిలించుకుపోయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

టి.నరసాపురం : నాటుసారా స్థావరాన్ని దాడి చేసి 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా చింతలపూడి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని టి.నరసాపురం మండలంలోని తిరుమలదేవిపేటలో నాటు సారా స్థావరంపై శనివారం దాడి చేశారు. ఈ దాడిలో 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. అలాగే నాటుసారా తయారు చేస్తున్న వ్యక్తితో పాటు బెల్లం సరఫరా చేసిన వ్యక్తి వద్ద నుంచి 110 కేజీల బెల్లం స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు

బాబూ జగ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా ఏలూరు ఫైర్ స్టేషన్ సమీపంలో ఉన్న ఆయన కాంస్య విగ్రహానికి ఎపి ఎస్‌సిఎస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి రామారావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బడుగు, బలహీన తరగతుల అభ్యున్నతి కోసం పోరాడిన దార్శనికుడు బాబూ జగ్జీవన్ రామ్ అని కొనియాడారు.


ఏలూరులో..

ఏలూరు సిటీ : భారతదేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు బ్లాక్ టు అధ్యక్షులు లంక రామచంద్రరావు, కాంగ్రెస్ జిల్లా సెక్రటరీ గౌడు రంగబాబు, పార్టీ నాయకులు ప్రతాప బాల వెంకట సుబ్రహ్మణ్య శర్మ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : స్థానిక ఎస్‌సి కాలనీలో ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద జగ్జీవన్‌రామ్ యూత్ అధ్యక్షులు బొబ్బర చిట్టిబాబు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకుడు ముప్పిడి చినబాబు మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పులపల్లి రవికుమార్, మెరిపే బాబి, పులపాకుల దుర్గారావు, పాత కాకుల రత్నరాజు, కండెల్లి శివ, బొబ్బర రాజు, ఏలేటి సోమరాజు, శ్రీను, ముప్పిడి మనోజ్, బొబ్బర చిన్నచిట్టిబాబు, పులపల్లి వెంకటరావు, బొబ్బర మంగరాజు, వెంకటరత్నం, కృష్ణబాబు, కైకవరపు గోపీ, బొబ్బర జెషిల్, పసలపూడి అశోక్, గెల్లా సోమరాజు, ముప్పిడి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : బిసి సబ్ ప్లాన్ - ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన పోరాట వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌ఆర్ పేట సంఘం కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కెవిపిఎస్ జిల్లా నాయకులు మంచెల ఇసాక్ పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వేదిక జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, బిసి జెఎసి నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ మాట్లాడారు.

జీలుగుమిల్లి : మండలంలోని దర్భగూడెంలో అరుంధతి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సాంబ, రాము, గ్రామస్తులు వంశీ, రాంబాబు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : నగర పంచాయతీలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహనికి చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధం, హరిత విప్లవంలో జగ్జీవన్‌రామ్ విజయకేతనాన్ని ఎగరవేశారని తెలిపారు. అలాంటి వారిని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : మండలంలోని గొల్లగూడెం, నల్లమాడు, కంసాలిగుంట, నారాయణపురం, ఉంగుటూరు, తదితర గ్రామాల్లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నారాయణపురం జెడ్‌పి హైస్కూల్ సమీపంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి సర్పంచి దిడ్ల అలకనంద ఆధ్వర్యంలో పూలదండలు వేసి ఆయన సేవలను కొనియారు. యువకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

ముసునూరు : అట్టడుగు తరగతుల అభ్యున్నతి, అణగారిన ప్రజల సమాన హక్కుల కోసం బాబూ జగ్జీవన్ రామ్ చేసిన పోరాటం మర్చిపోలేనిదని కాట్రేనిపాడు గ్రామ సర్పంచి గద్దల సుహాసిని మోహన్‌రావు అన్నారు. మండలంలోని 16 గ్రామాల్లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూర్యదేవర శ్రీనివాసరావు, రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ, కొండేటి బాబి, లక్కపాము కాంతారావు, గరికముక్కు నాని, పాశం నాగబాబు, వేంపాటి శ్రీనివాసరావు, మెదరమెట్ల సురేంద్ర, పలువురు నాయకులు, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : పట్టణంలో, బాపూనగర్ మూడు బొమ్మల సెంటర్‌లో ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ముఖ్య అతిథిగా ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ అధ్యక్షులు దుబ్బాకు దేవరాజు మాదిగ, విశిష్ట అతిథిగా బిఎస్‌పి నూజివీడు నియోజకవర్గ అధ్యక్షులు డాక్టర్ చలిగంటి వెంకటేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కలపాల విలియమ్స్ మాదిగ, లాగు కుమార్ మాదిగ, తగరం వరరత్నకుమార్ మాస్టారు, కొడవటి భాస్కరరావు మాదిగ, మట్టా రంగారావు మాదిగ, బొడ్డు రాజు మాదిగ, తేనేటి కిరణ్ మాదిగ, నాగేశ్వరరావు మాదిగ, బాపూనగర్ పెద్దలు, యువత పాల్గొన్నారు.

దెందులూరు : తహశీల్దార్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి తహశీల్దార్ బి.సుమతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ భారతదేశ ఆహార భద్రత భవిష్యత్తు కోసం పరితపించిన గొప్ప మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ స్వామిదాసు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, విఆర్‌ఒలు ఉన్నారు.

ద్వారకాతిరుమల : మండలంలోని జి.కొత్తపల్లిలో నిర్వహించిన వేడుకల్లో గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు పాల్గొని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఉప ప్రధానిగా, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సమ సమాజ దార్శనికుడిగా జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు.

జంగారెడ్డిగూడెంలో...

జంగారెడ్డిగూడెం : సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ నాయకులు బి.బాలరాజు అధ్యక్షతన జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు ఆర్.నాగరాజు, జి.లక్ష్మణ్, గోయమ్మ, ఎస్‌కె.మాబు, వి.గోపీ, ఎం.జీవరత్నం, పి.సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో కూటమి పార్టీ నాయకులు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ముప్పిడి శ్రీను అధ్యక్షతన జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు బొబ్బర పాల్, పరిమి సత్తిపండు, కొండ్రెడ్డి కిషోర్, మున్సిపల్ ఛైర్పర్సన్ భర్త బత్తిన చిన్నా, కౌన్సిలర్ నీకూరి కిషోర్, లావణ్య పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ఆగిరిపల్లి బస్టాండ్ సెంటర్ వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ యువసేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి సర్పంచి సిహెచ్.లక్ష్మీవిక్టర్‌బాబు, జయరాజు, ఆశీర్వాదం, సురేష్, కె.ప్రదీప్, బి.రాము, బి.సురేష్, సాల్మన్ చంటి, ఎన్.కాంచనరావు, టి.సురేష్, కె.రంగారావు, టి.ఆనంద్, రాంబాబు, ప్రదీప్ పాల్గొన్నారు.

ముదినేపల్లి: మండలంలోని చేవూరుగూడెంలో టిడిపి నియోజవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కో-కన్వీనర్ కొడాలి వినోద్ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెనుమల్లి శివారు సీయోను కాలనీలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు సేవ నాగ జగన్ బాబురావు, ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు యేసుపోగు దానియేలు పూలమాలలు వేసి స్వీట్లు, పండ్లు పంచారు.

ఏలూరు సిటీ : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ, కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, కార్యాలయ సిబ్బంది, జిల్లా కేంద్ర గ్రంథాలయం సిబ్బంది పాల్గొన్నారు.

టి.నరసాపురం : టి.నరసాపురంలో జగ్జీవన్ రామ్ యూత్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన మండలాధ్యక్షుడు అడపా నాగరాజు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎం.జయబాబు, దేవరపల్లి ముత్తయ్య, సిహెచ్.నవీన్, లంక జయబాబు, నందిపాము రవి, నర్లపాటి దుర్గయ్య, జుజ్జువరపు జయరాజు, బి.శ్రీను, రాయల పీరయ్య, నారపాము దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం : అభ్యుదయ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉండ్రాజవరపు మూర్తి, తోలేటి రఘుబాబు పోలవరం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గూటాల గ్రామంలో దిగుమర్తి ఆనందరావు ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఐ పవన్ కుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : ఎంఆర్‌పిఎస్ నాయకులు, కెవిపిఎస్ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గంగాధరరావు, బొబ్బర ఎలీషా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్, ఉండ్రాజవరం పెంటయ్య, అద్దేపల్లి నవీన్, శివాజీ పాల్గొన్నారు.

చాట్రాయి : చనుబండ గ్రామంలో జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఎంఆర్‌పిఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.కారుమంచి ఇస్తారయ్య అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో నూజివీడు ఎఎంసి ఛైర్మన్ పదవి పరిశీలనలో ఉన్న కొండేటి ఉదయ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం 50 మంది వృద్ధులకు, వితంతువులకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి గార్లపాటి మారేష్, కోట జోషి, అప్పికట్ల కుమార్, సత్యం, ముత్తయ్య, ఫిరంగి పుల్లయ్య మాస్టర్, రాజా పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు

12,800 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు
లక్ష గోనెసంచులు సిద్ధం
భీమడోలు వ్యవసాయాధికారి

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలో వరి కోతలు ఆలస్యంగా ప్రారంభమైన నేపథ్యంలో ధాన్యం సేకరణ కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభం కానుంది. ఈ నెల పదో తేదీ నుంచి ధాన్యం సేకరణ కార్యక్రమం ముమ్మరంగా ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ధాన్యం కొనుగోలును కూటమి నాయకులు ఎంఎల్ఎ చేతులమీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మండలంలో ప్రస్తుత సీజన్‌లో 12,800 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు జరిగింది. అధిక శాతం రైతులు పిఆర్ 126, ఎంటియు 1121 రకాలను సాగు చేశారు. దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్న అంచనాల నేపథ్యంలో ఎకరం ఒక్కింటికి 60 బస్తాల వరకు దిగుబడి వస్తుందని లెక్కలు కడుతున్నారు. మొత్తంగా 56,756 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని, పూర్తిస్థాయిలో రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేశామని అధికారులు అంటున్నారు. ధాన్యం కొనుగోలు కోసం 12 రైతు సేవా కేంద్రాలకు అదనంగా పొలసానిపల్లి, అంబరుపేట రెవెన్యూ పరిధిలో ఎఫ్‌పిఒ ఏజెన్సీలను సిద్ధం చేశారు. ధాన్యం సేకరణ కోసం 14 లక్షల గోనె సంచులు అవసరమవుతాయని, ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం సేకరణ కోసం ఒక లక్ష గోనెసంచులను సిద్ధం చేశామని తెలిపారు. గత సీజన్ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మూడు గంటల వ్యవధిలో ధాన్యం దిగుమతి, 21 రోజుల లోగా ధాన్యం సొమ్ములు చెల్లింపునకు ప్రభుత్వం సన్నాహాలు చేసిందని తెలిపారు. రైతు సేవా కేంద్రం వద్ద ఖరారు చేసిన తేమశాతం ఆధారంగా మాత్రమే కొనుగోళ్లు ఉంటాయన్నారు. మండలంలో ఇప్పటివరకు 550 ఎకరాల విస్తీర్ణంలో కోతలు పూర్తయ్యాయని భీమడోలు వ్యవసాయాధికారి తెలిపారు. ధాన్యం కొనుగోలు కోసం తమ శాఖ ఇతర శాఖల సహాయ సహకారాలతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వ్యవసాయ అధికారి తెలిపారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత దాని తరలింపు ఇతర అంశాలను భీమడోలు మండలంలో గల వివిధ సొసైటీలకు బాధ్యతలు అప్పగించామన్నారు. ఈ మేరకు గుండుగొలను సొసైటీ మూడు రైతు సేవా కేంద్రాలు, భీమడోలు సొసైటీ ఐదు రైతు సేవా కేంద్రాలు, పూళ్ల సొసైటీ నాలుగు రైతు సేవా కేంద్రాలు బాధ్యతలను స్వీకరిస్తాయని వీటికి అదనంగా ఎఫ్‌పిఒ ఏజెన్సీలో రెండు చోట్ల ధాన్యం సేకరణ కార్యక్రమంలో భాగస్వాములు అవుతారని తెలిపారు.

ధాన్యం ఆరబెడుతున్న రైతులు

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

ముదినేపల్లి : శ్రీహరిపురం గ్రామ శివారు చేవూరుపాలెంలో పంచాయతీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గ్రామ సర్పంచి పరసా విశ్వేశ్వరరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఉప సర్పంచి బత్తుల నాగేశ్వరమ్మ, పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఆనందాసు నాగరాజు, పరసా చింతలమ్మ, జనసేన మండలాధ్యక్షులు వీరంకి వెంకయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ మండలం, పెనుగొండ చెరుకువాడ గ్రామానికి చెందిన కండిబోయిన వెంకట రామకృష్ణ పాస్‌పోర్ట్ నెం - **X3802151** తీసుకుని గాంధీ బొమ్మల సెంటర్ జిరాక్స్ నిమిత్తం వెళ్తుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికినవారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

అడ్రస్: కండిబోయిన వెంకట రామకృష్ణ
S/o. కండిబోయిన వెంకటేశ్వరరావు
డోర్ నెం. 29-69, పెచ్చేటి వారి వీధి
చెరుకువాడ. పెనుగొండ గ్రామం
పెనుగొండ మండలం
పశ్చిమగోదావరి జిల్లా-534320
సెల్: 98483 51282

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, ఇరగవరం మండలం, ఐనపర్రు గ్రామానికి చెందిన కొవ్వూరి పెద్ద శ్రీను, S/o వీర్రెడ్డి అను నేను నా యొక్క **పాస్‌పోర్టు నెం. F8102044.** గల పాస్‌పోర్ట్ ఐనపర్రు నుండి ఇరగవరం ఈ సేవ దగ్గరకి వెళ్ళుచుండగా నా యొక్క పాస్‌పోర్టు మార్గ మధ్యలో పడిపోయింది. నేను వెళ్ళిన మార్గ మధ్యలో, చుట్టుప్రక్కల ఎంత వెతికినను దొరకలేదు. ఎవరికైనా పాస్‌పోర్టు దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకి తెలియజేయగలరు.

కొవ్వూరి పెద్దశ్రీను
S/o. వీర్రెడ్డి
ఐనపర్రు గ్రామం
ఇరగవరం మండలం, ప॥గో॥జిల్లా
సెల్ నెం: 89781 51142

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P. No. 24/2023 in
O.S. No. 240/2021

Between:
బూరాబత్తుల శ్రీనివాసరావు ...పిటీషనరు/డిక్రీ హోల్డర్
And
1. పాలా శ్రీనివాసరావు @ శ్రీనివాస్
2. పాలా ఝాన్సీ ...రెస్పాండెంటు/జడ్జిమెంట్ డేబ్టర్

To:
R-1: 1. పాలా శ్రీనివాసరావు @ శ్రీనివాస్, తండ్రి: వెంకటరావు, వయస్సు 47 సం॥, పురుషుడు, వ్యాపారం, డోర్ నెంబర్ 10-109/1, అంబటివానిచెరువు, H/o పోడూరు, పోడూరు మండలం.

పై నెంబరు పిటిషనులో 1వ రెస్పాండెంటు/1వ జడ్జిమెంట్ డేటర్ హాజరు నిమిత్తం **ది.23-04-2025 సం.తేదికి** వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వాయిదా రోజున పై కోర్టు వారి ఎదుట **ఉదయం 10-30 ని॥లకు** స్వయముగా కానీ, న్యాయవాది గారి ద్వారా కానీ హాజరు అయి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు పిటిషను ముందు గ్రంధము జరుపబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

మేడపాటి వెంకట రామారెడ్డి
పాలకొల్లు న్యాయవాది
తేది:27-03-2025 పాలకొల్లు, ప॥గో॥జిల్లా

విద్యా హక్కు చట్టాన్ని విధిగా అమలు చేయాలి

ప్రజాశక్తి - మండవల్లి

విద్యాహక్కు చట్టాన్ని విధిగా అమలు చేసి కార్పొరేట్ ప్రయివేట్ సంస్థల్లో పేద విద్యార్థులకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్.భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టి.అప్పారావు డిమాండ్ చేశారు. స్థానిక గ్రంథాలయం వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. 2009 విద్యాహక్కు చట్ట ప్రకారం 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించి ఉచిత విద్యను అందించాల్సి ఉందని తెలిపారు. ఆ చట్టం ఎక్కడా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రయివేట్ విద్యా సంస్థల వల్ల పసిడి బాల్యం బందీ అవ్వడంతో పాటు అధిక ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారన్నారు. ఇప్పటికైనా విద్యాహక్కు చట్టాన్ని నిబంధనలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని వారు డిమాండ్ చేశారు.

విజయరామరాజుకు ఎస్‌టియు నివాళి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత, ఎస్‌టియు మాసపత్రిక, ఉపాధ్యాయ వాణి ఫౌండర్ వీణా విజయరామరాజు 25వ వర్థంతి కార్యక్రమాన్ని ఎస్‌టియు మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగిరిపల్లి మండల వనరుల కేంద్రం వద్ద ఎస్‌టియు స్థూపం వద్ద విజయరామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు సిహెచ్.సురేష్‌కుమార్, టి.నరసింహారావు, ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'వక్ఫ్ బోర్డు చట్ట సవరణతో పేద ముస్లింలకు ప్రయోజనం'

నూజివీడు టౌన్ : వక్ఫ్ బోర్డు చట్ట సవరణతో పేద ముస్లింలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పలువురు టిడిపి నాయకులు, ముస్లిం నేతలు అన్నారు. పట్టణంలోని మంత్రి పార్థసారధి క్యాంపు కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మున్సిపల్ టిడిపి ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, ముస్లిం నేతలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు రాష్ట్ర ప్రభుత్వం మూడు ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారు.

సిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అధ్యక్షతన భీమడోలు సిహెచ్‌సి అభివృద్ధి కమిటీ, పర్యవేక్షకులు డాక్టర్ ఎస్.సునీత ఆధ్వర్యంలోని వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అన్నారు. ఇదే తరహా సేవలు మరింత విస్తృత స్థాయిలో అందించేందుకు ఆరోగ్య కేంద్రాన్ని అప్ గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. టిడిపి నాయకులు కరుటూరి వెంకట జగప్రసాద్ తన పుట్టినరోజును పురస్కరించుకుని సామాజిక ఆరోగ్య కేంద్రానికి రూ.40 వేల విలువైన వాటర్ కూలర్ యూనిట్‌ను శనివారం గన్ని వీరాంజనేయులు చేతుల మీదుగా సామాజిక ఆరోగ్య కేంద్రానికి అందించారు. దీనిని ఆరోగ్య కేంద్రం మత్తు వైద్య నిపుణులు అశ్విని స్వీకరించారు. అనంతరం రోగులకు టిడిపి నాయకుల పుట్టినరోజును పురస్కరించుకుని రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రష్మీ, ఇతర సిబ్బందితో పాటు అభివృద్ధి కమిటీ సభ్యులు ఎం.సుబ్రహ్మణ్యం, వై.శ్రీనివాస్, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు సభ్యులు కరణం పెద్దిరాజు, భీమడోలు ఎఎంసి మాజీ ఛైర్మన్ డి.పుల్లయ్య నాయుడు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో సుపరిపాలన

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని

ప్రజాశక్తి - దెందులూరు

ప్రజలకు మెరుగైన సుపరిపాలన అందించేదే రామరాజ్యమని, అటువంటి రామరాజ్యమే స్ఫూర్తిగా రాష్ట్రంలోని అన్ని తరగతుల ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తూ సిఎం చంద్రబాబు పరిపాలన కొనసాగిస్తున్నారని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని దెందులూరు నియోజకవర్గంలోని పెదపాడు, పెదవేగి, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల పరిధిలోని గ్రామాల్లో ఉన్న దాదాపు 500 రామాలయాల్లో జరగనున్న శ్రీరామనవమి వేడుకల నిమిత్తం పానకం తయారీ కోసం మొత్తం ఎనిమిది టన్నుల బెల్లాన్ని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ప్రత్యేకంగా అనకాపల్లి నుంచి తెప్పించి శనివారం ఉదయం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ప్రత్యేకంగా కేటాయించిన ఆటోలు, జీపులు, కార్లు వాహనాల ద్వారా బెల్లం ఆయా గ్రామాలకు చేరుకుని రామాలయాలకు అందించే విధంగా స్థానిక కూటమి నాయకులకు ప్రత్యేక బాధ్యతలు కేటాయించారు. ప్రతి రామాలయానికి 15 కేజీల బెల్లపు కుందె ఇవ్వాలని, యాత్రికులు ఎక్కువగా ఉండే ఆలయాలకు అదనపు బెల్లపు కుందెలు కూడా ఇవ్వాలని సూచించారు.

పీజీ సెంటర్‌లో అడ్మిషన్స్ హెల్ప్ సెంటర్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని డాక్టర్ ఎంఆర్.అప్పారావు పీజీ సెంటర్‌లో పీజీ అడ్మిషన్ల కోసం హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.నవీనలావణ్యలత తెలిపారు. ప్రిన్సిపల్ నవీన లావణ్య లత శనివారం మాట్లాడుతూ పీజీ అడ్మిషన్స్ హెల్ప్ డెస్క్ ఈ నెల ఏడో తేదీన విద్యార్థుల అవసరార్థం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పీజీ సెట్ - 2025కు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. ఈ నెల రెండో తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు, డిగ్రీ పూర్తయిన వారు, డిగ్రీ ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసిన వారు అర్హులని తెలిపారు. ఈ ఎంట్రెన్స్ ద్వారా క్వాలిఫై అయిన విద్యార్థులకు పీజీ కోర్సుల్లో చదివేందుకు అర్హత లభిస్తుందన్నారు. పీజీ సెంటర్‌లో అప్లైడ్ మ్యాథమెటిక్స్ విభాగంలో 44, ఫిజిక్స్ విభాగంలో 40, ఎనలిటికల్ కెమిస్ట్రీ విభాగంలో 40, ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగంలో 40, బయో కెమిస్ట్రీ విభాగంలో 33, స్టాటిస్టిక్స్ విభాగంలో 33, ఎంకామ్ విభాగంలో 44, ఎంబిఎ విభాగంలో 66 సీట్లు ఉంటాయన్నారు. నూజివీడు పట్టణ, పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులు ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి పీజీ కోర్సులకు దరఖాస్తు చేయవచ్చన్నారు. పీజీ కోర్సుల్లో చేరాలనుకునే అర్హత కలిగిన విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉందన్నారు. పీజీ సెంటర్‌లో ఏర్పాటు చేసే హెల్ప్ డెస్క్ ద్వారా విద్యార్థులకు సలహాలు, సూచనలు అందించనున్నట్లు చెప్పారు. పీజీ ఎంట్రన్స్ టెస్ట్‌కు సంబంధించిన దరఖాస్తులను ఉచితంగా దాఖలు చేసుకోవచ్చన్నారు. కేవలం పరీక్ష ఫీజు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. మిగిలిన సేవలు ఉచితంగా పొందేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. హెల్ప్ డెస్క్‌లో నిత్యం అనుభవం కలిగిన ఇద్దరూ అధ్యాపకులు విద్యార్థులకు సేవలందిస్తారని తెలిపారు.